క్లుప్తంగా

కాలినడకన శబరిమల యాత్ర



శబరిమలకు కాలినడకన బయలుదేరిన అయ్యప్ప భక్తులు

పుంగనూరు: శబరిమలలోని అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు ఆదివారం పుంగనూరు నుంచి పలువురు మాల ధరించి కాలినడకన బయలుదేరారు. పట్టణంలోని కట్టకిందపాళెం, చింతలవీధి, ఎన్ఎస్.పేటకు చెందిన భక్తులు అయ్యప్ప ఆలయంలో పూజలు చేసుకుని కాలినడకన శబరిమల వెళ్లి అయ్యప్ప స్వామికి మొక్కులు చెల్లించనున్నట్లు వారు తెలిపారు. జనవరి 14న మకర సంక్రాంతి రోజున వారు శబరిమల చేరి అయ్యప్ప స్వామిని దర్శించుకోనున్నారు.

50 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

రామకుప్పం: స్థానిక సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈశిబిరంలో 50 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించగా అందులో 10 మందిని మెరుగైన చికిత్స కోసం పీఈఎస్ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు వైద్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు సంజనారెడ్డి, అనుపమ, శరణ్య పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

పుంగనూరు: పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని కొత్తయిండ్లలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో సత్యనారాయణస్వామి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం వేదపండితులు సత్యనారాయణస్వామి వ్రత కల్పాన్ని చదివి వినిపించగా భక్తులు స్వామి వారికి పూజలు చేశారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం కోకోకోలా హెచ్‌సీసీబీవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 265 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు వైష్ణవి, సౌమ్య తెలిపారు. రిడో స్వచ్ఛంద సంస్థ సహకారంతో గ్రామాల నుంచి పలు వ్యాధులతో బాధపడుతున్న వారిని తరలించి వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. తిరుపతి ఎస్ఆర్ఐకేర్ ఆస్పత్రి సిబ్బంది, రిడో సంస్థ నిర్వాహకులు రమణ, బ్యాంకు రెడ్డెప్ప, శ్రీరాములు, సురేష్, వెంకటరమణ, గోవిందు, ఆశా కార్యకర్తలు అనూరాధ, లలితమ్మ పాల్గొన్నారు.

సామాజిక సేవకుడికి సన్మానం



సీతారామయ్యను సత్కరిస్తున్న సంఘాల నిర్వాహకులు

పలమనేరు: పట్టణానికి చెందిన సామాజిక సేవకులు శ్రీపురం సీతారామయ్య 88వ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక లయన్స్‌క్లబ్ తోపాటు పలు సంస్థలు ఆదివారం ఆయన చేస్తున్న సేవలను కొనియాడుతూ పౌర సన్మానం చేశాయి. విద్యాసంస్థలు, అంగన్‌వాడీలు, ఉచిత కంటి పరీక్షలు, సామూహిక వివాహాలు, సాహితి, సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్న భోజనానికి ప్లేట్లను ఆయన గత పదేళ్లుగా అందిస్తున్న విషయం తెలిసిందే. దీంతో పట్టణంలోని ప్రజాసంఘాలైన పీపీఎస్, ఏపీ ఎన్జీఓలు, పలమనేరు ప్రకృతి, వాసవీ మహిళా సమాఖ్య, రసజ్ఞుల సమాఖ్య, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి, రత్నా బయోటెక్, కన్యకా పరమేశ్వరి సంస్థలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

లాభాల అరటి

- సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు
- తగిన జాగ్రత్తలతో అధిక దిగుబడి
- ఉద్యానశాఖాధికారిణి సూచనలు



మండలంలో సాగులో ఉన్న అరటి తోట

వి.కోట: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో అరటి ముడిపడి ఉంది. అరటి పండు లేకుండా ఏ శుభకార్యం నోచుకోదనే చెప్పవచ్చు. అంతేకాక నిత్యజీవితంలోనూ అరటి ఒక భాగమైపోయింది. అరటి పండుకు ఆహార, ఆరోగ్య విలువల వలన దానిని అమృతఫలం, కల్పతరువు అని అంటారు. ప్రతిరోజూ ఒక అరటి పండు తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు తెలుపుతున్నారు. ఇన్ని ప్రయోజనాలు ఉన్న అరటికి మంచి డిమాండ్ ఉండడంతో మండల రైతులు అధికంగా సాగుచేస్తున్నారు. వి.కోట మండలం అరటి సాగుకు అనుకూలమైన నేలలుగా ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ఇక్కడి రైతులు అరటి తోటల పెంపకంపై ఎక్కువగా మక్కువ చూపుతుంటారు.

అరటి సాగుకు అనుకూల నేలలు, వాతావరణం

నీరు ఇంకి పోవు గుణం గల సారవంతమైన నేలలు అరటికి మిక్కిలి అనుకూలం. ఉదజని సూచిక 6.5 నుంచి 7.5 ఉన్న భూములు చాలా అనుకూలం. అంతేకాకండా అరటి ఉష్ణ మండల పంట. 10 డిగ్రీల నుంచి 40 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వరకు మంచి దిగుబడి వస్తుంది. అధిక చౌడు, ఆమ్ల శాతం ఉన్న భూమిలో పనామా-మాడు తెగులు వచ్చే అవకాశం ఉంటుంది.

టిష్యూ కల్చర్ మొక్కలు ఉత్తమం


టిష్యూ కల్చర్ ద్వారా ప్రవర్తనం జరిపిన అరటి మొక్కలను రైతులు నాటాలని అధికారులు సూచిస్తున్నారు. తెగుళ్లు లేని అధిక దిగుబడి, నాణ్యత కలిగిన తల్లి మొక్క నుంచి కణజాలాన్ని సేకరించి ప్రయోగశాలలో అవసరమైన వెలుతురు, గాలిలో తేమ, ఉష్ణోగ్రత లాంటి పరిస్థితులను కల్పించి కణజాలం నుంచి పిల్ల మొక్కలను ఉత్పత్తి చేసే ప్రక్రియే టిష్యూ కల్చర్. వీటికి ముఖ్యంగా వైరస్ తెగుళ్లు, నులిపురుగులు ఆశించే అవకాశం ఉండదు.

మొక్కలు నాటే విధానం..

అరటి ఎకరానికి 1,235 లేదా 1,280 మొక్కలు నాటాలి. గుంత నుంచి వచ్చిన మట్టికి 5 కిలోల పశువుల ఎరువు, అర కిలో వేపపిండి, 300 గ్రాముల సూపర్ ఫాస్పేట్ ఎరువు, 30 గ్రాముల లిండెన్ పొడి మందు చేర్చి బాగా కలియబెట్టి గుంత నింపి అనంతరం మొక్కను నాటాలి.

అంతర పంటలకు అనుకూలం

అరటి తోట అంతర్ పంటలకు అనుకూలంగా ఉంటుంది. అరటి సాగులో అంతర పంటలుగా వేరుశనగ, అలసంద, పసుపు, అల్లం, ఉల్లి, వెల్లుల్లి, అనాస, ఆకుకూరలు, క్యారెట్, కాలీఫ్లవర్, క్యాబేజీ వేసుకుని లాభాలు సాధించవచ్చని అధికారులు సూచిస్తున్నారు. అంతేకాక దీర్ఘకాలిక పంటలైన మామిడి తోటల్లోనూ ఈ అరటి సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చు. అయితే అంతరపంటలకు అరటితో సంబంధం లేకుండా ఎరువులు అదనంగా ఇవ్వాలి. అరటి సాగుకు ఎక్కువగా నీరు అవసరం, కానీ నీరు ఎక్కువ నిల్వ ఉండరాదు కాబట్టి రైతులు డ్రిప్ పద్ధతిలో నీరు కట్టడం ఉత్తమం. అంతేకాక ఫర్టిగేషన్ పద్ధతిలో ఎరువులు వేస్తే అరటి చెట్లు అధిక దిగుబడులు ఇస్తాయి.



మామిడి తోటలో అంతరపంటగా అరటి సాగు

అరటి సాగులో అంతరకృషి ముఖ్యం

అరటిలో తల్లి చెట్టుకు సరైన పోషకాలు అందుబాటులో ఉంచడం, బలంగా ఉంచడానికి అంతరకృషి చాలా ముఖ్యం పాత్ర పోషిస్తుంది. ఇందుకోసం అరటి పిలకలు తల్లి చెట్టుతో పాటు ఎదిగినట్లైతే అవి తల్లి చెట్లకి పోషక పదార్థాల లోపాలను కలగజేస్తుంది. కావున చిన్నవిగా ఉన్నప్పుడే పిలకలను తొలగించాలి. అరటి చెట్టు రకాన్ని బట్టి 10 అడుగుల కన్నా ఎత్తైనప్పుడు పూతకు వచ్చి గెల వేసిన తర్వాత బరువుకు చెట్టుపడకుండా కర్రల ద్వారా ఊతం అందించాలి. గెల వేసిన తర్వాత ఆఖరి హస్తం విడిచిన 3-4 రోజుల తర్వాత గెల చివరన ఉండే మగపువ్వుని తుంచి వేయాలి. బన్స్ ఫీడింగ్ మిశ్రమం(ఆవుపేడ, ఆవు మూత్రం, మల్టీ కే)ను మగపువ్వుని తుంచిన తర్వాత బన్స్ ఫీడింగ్ మిశ్రమాన్ని పాలీకవర్‌లో పెట్టి గెలకు కట్టాలి.

సస్యరక్షణలో తీసుకోవాల్సిన చర్యలు

- కాండం తొలుచు పురుగు నివారణకు పూత రాక ముందు మోనో క్రోటోఫాస్ ఇంజెక్షన్ ఇవ్వాలి.
- ముక్కు పురుగు దుంపలో వలయాకారపు బొరియలు చేసి దుంప కుళ్లిపోయేలా చేస్తుంది. దీని నివారణకు ఒక్కో మొక్కకు 25 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలను చెట్టు మొదళ్లలో వేసి మట్టితో కప్పి నీరు పెట్టాలి.
- నులిపురుగులు చెట్టు వేళ్లను ఆశించి దుంప బలహీన పడి ఆకులు నల్లగా మాడి ఎండిపోతుంది. దీని నివారణకు వేప పిండి 200 గ్రాములు,100 గ్రాముల వీఏఎం కలిపి ఒక్కో మొక్కకు వేయాలి.
- ఆకులపై మొట్టమొదట చిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడి క్రమేపి వివిధ దశల్లో ఆకులు పూర్తిగా రాలిపోతాయి. దీని నివారణకు మాంకోజెట్ 2.5 గ్రాములు, క్లోరోథాలోనిల్ 2 గ్రాములు ఒక్క లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పేనుబంక వల్ల వైరస్ తెగుళ్లు ఆశించి మొక్కల్లో పెరుగుదల ఆగకుండా నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు ఒక్క లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

అరటి సాగులో మెలకువలు ముఖ్యం



మండలంలో 400 రైతులు, 340 ఎకరాల్లో సాగు చేశారు. అరటి పంట సాగు చేసే రైతులు అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చు. వి.కోట మండలంలో అధిక శాతంలో రైతులు అరటి పంటను సాగుచేస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి విదేశాలకు సైతం అరటి ఎగుమతి చేస్తున్నారు. అరటి సాగుకు వేసవిలో లోతుగా దుక్కి చేసి బాగా ఎండపెట్టిన భూమిలో అరటి వేయాలి. పంట మార్పిడి చేయాలి. బంతి పంటను పండించిన తర్వాత అరటిని నాటాలి. డ్రిప్ పద్ధతిలో సాగు చేయడం ఉత్తమం. అరటిని మామిడి తోటల్లో అంతర పంటగాను, అరటి తోటల్లో వివిధ అంతరపంటలు సాగు చేసుకోవచ్చు.

–లక్ష్మీప్రసన్న, ఉద్యానశాఖాధికారిణి, వి.కోట

ఈ రోడ్లు బాగుపడేనా?



గుంతలమయంగా జోగివారిపల్లె రోడ్డు

సదుం: మండల కేంద్రం నుంచి జోగివారిపల్లె, కలికిరికి వెళ్లే దారులు గుంతలమయంగా మారడంతో వాహనదారులకు ప్రయాణం నరకంగా మారుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పెద్ద పెద్ద గుంతలుగా మారి అందులో వర్షపు నీరు చేరి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మండల కేంద్రం నుంచి జోగివారిపల్లెకు వెళ్లే ప్రధాన మార్గంలోనే పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్, వెటర్నరీ హాస్పిటల్, ఎంఈఓ, సీఎల్ఆర్సీ, సచివాలయాలు వంటి కార్యాలయాలకు ఈమార్గంలోనే వెళ్లాల్సి ఉంటుంది. గుంతలమయంగా మారిన రోడ్డుకు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో తాత్కాలికంగా మట్టి పోస్తున్నా.. వర్షాలకు కొట్టుకుపోయి మళ్లీ పరిస్థితి మొదటికే వస్తోంది. అలాగే కలికిరి మార్గంలో మండల పరిధిలో పలుచోట్ల రోడ్డుపై గుంతలు పడ్డాయి. తరచూ కురుస్తున్న వర్షాలతో ఈ మార్గాలు అధ్వాన్నంగా తయారై వాహనదారులకు చుక్కలు చూపుతున్నాయి. సంక్రాంతికి రోడ్లలో గుంతలు లేకుండా చూస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు చేస్తోంది. మరి ఈ మార్గాల్లో మరమ్మతులు నిర్వహిస్తారో, అలాగే వదిలేస్తారోనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

కుప్పం: ఏఐటీయూసీ ఆరవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నేతలు కోరారు. ఆదివారం కుప్పం వంద పడకల ఆస్పత్రిలో కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ విజయవాడ హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో జరిగే రాష్ట్ర మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు ఎంప్లాయిస్ ఈ సభకు తరలివస్తారని, కార్మికుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే ప్రక్రియలో సభను నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సభలకు రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు రమాదేవి, సంగీత, తులసి, పళని, రామ్‌దాస్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న సభ్యులు

అన్నదానం

వి.కోట: పట్టణంలో లయన్స్‌క్లబ్ సభ్యులు ఆదివారం 500 మంది పేదలకు అన్నదానం చేశారు. ఈసందర్భగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ సంస్థ సభ్యుల పుట్టినరోజు పురస్కరించుకుని నెలలో 15వ తేదీలోపు ఉంటే ప్రతినెలా 15వ తేదీ పట్టణంలోని కేజీఎఫ్ బస్టాండు వద్ద అన్నదానం చేయడం ఆనవాయితీ అని తెలిపారు. ఈమేరకు పేదలకు అన్నదానం చేసి తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

17న రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

పుంగనూరు: పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఈనెల17న అఖిల భారత రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అఖిల భారత రిటైర్డ్ ఉద్యోగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రిటైర్డ్ ఉద్యోగులందరికి సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు అందరూ తప్పక హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోండి



ర్యాలీ చేస్తున్న సంఘం నేతలు

పెద్దపంజాణి: వెలమ కులం వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణ రాష్ట్రం షాద్‌నగర్ ఎమ్మెల్యే కాసులవాడ శంకరయ్య అలియాస్ వీరపల్లి శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు వెలమ సంఘం నేతలు ఆదివారం పెద్దపంజాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని శివాడి, అప్పినపల్లి, కుంబార్లపల్లి, రాజుపల్లి, పెద్దవెలగటూరు గ్రామాల నుంచి వచ్చిన వెలమ సంక్షేమ సంఘం నాయకులు మండల కేంద్రంలోని పలమనేరు-పుంగనూరు రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వెలమ సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసి తీవ్ర పదజాలంతో దూషించారని మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యలతో వెలమ సామాజిక వర్గానికి చెందిన అందరి మనోభావాలు కలత చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతనిపై చట్టపరంగా చర్యలు తీసుకుని వెలమ కులస్తుల మనోభావాలను కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వారు తెలిపారు.

కడపకు తరలిన ముస్లింలు

పుంగనూరు: వక్ఫ్ బోర్డు రద్దు చట్టాలను నిరసిస్తూ, ముస్లింల ఐక్యతను చాటుకునేందుకు ఆదివారం కడపలో జరగనున్న బహిరంగసభకు పుంగనూరు నుంచి వందలాది మంది ముస్లింలు తరలివెళ్లారు. పార్టీలకతీతంగా పుంగనూరు నియోజకవర్గంలోని ముస్లింలు 200 వాహనాల్లో తరలివెళ్లారు.

రెస్కోలో ఉద్యోగినులకు వేధింపులు



రెస్కో కార్యాలయం

కుప్పం: గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో)లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు విధి నిర్వహణలో తీవ్ర వేధింపులకు గురవుతున్నారు. సెలవు రోజుల్లో కూడా విధులు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తీసుకురావడంతో తప్పని పరిస్థితుల్లో పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి ఆదివారం ప్రధాన కార్యాలయంతో పాటు జాతీయ సెలవు దినాల్లో కుప్పం రెస్కో కార్యాలయంలో మాత్రం మహిళా ఉద్యోగులు మాత్రం విధులు నిర్వహించాలని అధికారులు ఒత్తిళ్లు తీసుకురావడం పట్టణంలో తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. గత రెండు నెలలుగా రెస్కోలో అకౌంటెంట్, అడ్మినిస్ట్రేషన్ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను ప్రతి ఆదివారం కార్యాలయానికి వచ్చి విధులు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ప్రస్తుతం రెస్కోలో ఉన్న పరిస్థితుల నిమిత్తం ఉద్యోగ భద్రత కోసం తప్పని పరిస్థితుల్లో సెలవు దినాల్లో విధులకు హాజరవుతున్నామంటూ మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడాలేని విధంగా సెలవు దినాలను పని దినాలుగా మార్చి మహిళా ఉద్యోగులను మాత్రమే విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించడం సమంజసం కాదని స్థానికులు అంటున్నారు.

ఏం పన్లేదా? నా బస్సే ఎక్కుతావా..!

- పాకాలలో మహిళా కండక్టర్ ఓవరాక్షన్
- పుంగనూరు డీఎంకు ఫిర్యాదు

పుంగనూరు: 'ప్రయాణికులతో మర్యాదగా నడచుకోండి..మన్ననలు పొందండి.. సంస్థకు ఆదాయం పెంచండి' ఇది ఎన్నో ఏళ్ల నుంచి ఆర్టీసీ అధికారులు సిబ్బందికి తరచూ చేసే హితబోధ. అయితే కొంతమంది సిబ్బంది తీరు ఇప్పటికీ మారడం లేదు. ప్రయాణికులతో అమర్యాదగా, దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఆదివారం పుంగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో చోటుచేసుకున్న సంఘటనతో మరోసారి తేటతెల్లమైంది. వివరాలు..పాకాల మండల కేంద్రం నుంచి ఓ పాత్రికేయుడు మధ్యాహ్నం 1.30 గంటలకు బస్టాండ్‌లో పుంగనూరు–తిరుపతి ఆర్టీసీ సర్వీసు (పల్లెవెలుగు) ఎక్కారు. కొంతసేపటికి కండక్టర్ టికెట్ అడగడంతో జర్నలిస్ట్ ఆర్టీసీ పాస్ ఆమెకు చూపించారు. దీంతో ఆమె కార్డును తీసుకుని పలు పర్యాయాలు చూసి, ఆతర్వాత 'ఏం పన్లేదా..నా బస్సే ఎక్కుతుంటావా?' అని ఒకింత చులకనగా అనడంతో జర్నలిస్ట్ షాక్‌కు గురయ్యారు. ప్రయాణికుల ముందు ఆమె అలా తూలనాడడంతో జర్నలిస్ట్ తనకెదురైన చేదు అనుభవాన్ని పుంగనూరు డిపో డీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందించారు. ఆ కండక్టర్‌పై చర్యలు తీసుకుంటామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని డీఎం హామీ ఇచ్చారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రొంపిచెర్ల: తొగట వీరక్షత్రియ కులానికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఈ సంఘం ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణుడు డిమాండ్ చేశారు. ఆదివారం కొల్లాపురమ్మ ఆలయం పక్కన తొగట వీర క్షత్రీయ సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ తొగట కులం అభివృద్ధిలో వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తొగట కులస్తుల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం చెపుతోందని, కానీ ఇప్పటి వరకు అమలు జరగలేదన్నారు. చేనేతలు తయారు చేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఆసందర్భంగా కోరారు.కార్యక్రమంలో తొగట సంఘం నేతలు మండపల్లె బాబు, జి.రెడ్డెప్ప, ఎం.జి.వెంకటరత్నం, జి.వెంకటసుబ్బయ్య, బొమ్మల వెంకటరత్నం, పురం మల్లయ్య, వెంకటనారాయణ, వెంకటరమణ, ప్రేమానందం, లక్ష్మీ నరసయ్య, నిరంజన్, చలపతి, రామూర్తి, చౌడయ్య, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

అమరజీవి త్యాగాన్ని మరువరాదు



పలమనేరు: మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నివాళి



పలమనేరు: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళిర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పలమనేరు: తెలుగువారి కోసం ప్రాణాలను త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు కష్టాన్ని రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరువరాదని పలమనేరు వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ మండి సుధా తెలిపారు. ఆమేరకు పార్టీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని ఎన్నో ఇబ్బందులు పడిన ఆ మహనీయుని అడుగుజాడల్లో నేటి సమాజం పయనించాలన్నారు. అదేవిధంగా స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రవి, కౌన్సిలర్లు కోదండరామయ్య, నేతలు రెడ్డెప్పరెడ్డి, షరీఫ్, కందల నరేష్ పాల్గొన్నారు.



పెద్దపంజాణి: నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ

అమరజీవి పొట్టి శ్రీరాములకు నివాళి

పెద్దపంజాణి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన గొప్ప ఉద్యమకారుడు పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీడీఓ బాలాజి, ఎంఈఓ తులసీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లె ఎమ్మార్సీలో..

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈఓలు సుబ్రమణ్యం, వేణుగోపాల్‌రెడ్డి, సీఆర్‌పీలు రామచంద్ర, షాబుద్దీన్, అంజిలి, స్వర్ణలత, వెంకటరమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు తప్పనిసరి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

వి.కోట: వాహనచోదకులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ బాబు సూచించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ఆయన పోలీస్ సిబ్బందితో కలసి వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నియంత్రించడానికి ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలని సూచించారు. . ప్రమాదాల నివారణకు వాహనదారులు నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానాలు విధించారు.

వైభవంగా పౌర్ణమి వేడుకలు



అలంకరణలో కాళభైరవేశ్వరస్వామి

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె శేషాద్రిస్వామి ఆలయం, కుప్పనపల్లె సమీపంలోని కాలభైరవేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రతినెలా ఆనవాయితీగా వస్తున్న పౌర్ణమి పూజలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.